

పూర్తి స్థాయిలో పత్తి కొనుగోలు చేయాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి తేమ పరీక్ష లేకుండా పూర్తి స్థాయిలో రైతుల వద్ద నుంచి పత్తి కొనుగోలు చేయాలనిఅదనపు కలెక్టర డేవిడ్‌కు బుధవారం బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరు ఎక్కువ శాతం పత్తి పంటనే పండిస్తారని ఎండనక వాననక వ్యవసాయం చేసే రైతులకు వాతావరణ దుష్ప్రభావం దండిగానే పడిందన్నారు. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి కాత, పూత విపరీతంగా రాలిపోయి పంట కేవలం 20 నుంచి 30 శాతం మాత్రమే దిగుబడి వచ్చేలా ఉందని తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు సాయికృష్ణ, సమ్మన్న, రాము ఉన్నారు.

కుష్టు వ్యాధిని అరికట్టాలి

కౌటాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బృందం సభ్యుడు డాక్టర్ సంపత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధి ప్రాథమిక దశలో గుర్తించి ఎండీటీ డ్రై ద్వారా పూర్తిగా నిర్మించవచ్చన్నారు. ఎల్‌సీడీసీ సర్వేపై కూడా అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎంపీడీ అరుణ, సురేందరరావు, డీపీఎంవో రాములునాయక్, రాజేందర్, పవన్‌కుమార్‌రెడ్డి, హరిషిత్ తదితరులు పాల్గొన్నారు.

తేలని 'ఈఎస్ఐ' భవితవ్యం

- కూల్చివేయాలని నివేదికలు అందజేసిన తనిఖీ బృందం
- కొత్త భవన నిర్మాణానికి నిధుల కోసం నిరీక్షణ
- ఎటూ తేల్చని రాష్ట్ర ప్రభుత్వం


కాగజ్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రి

కాగజ్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి భవిష్యతవ్యం ఇంకా తేలడం లేదు. గతమెంతో ఘనం.. ప్రస్తుతం దయనీయం అన్న చందంగా మారింది కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి పరిస్థితి. ఒకప్పుడు వందలాది మంది రోగులతో కిటకిటలాడగా ప్రస్తుతం ఒక్క ఇన్‌పెషెంట్ లేని పరిస్థితి. కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం, సర్‌సిల్క్ మిల్లు కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 50 ఏళ్ల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్మించారు. ఇప్పుడు భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉండడంతో ఇక్కడి అధికారులు భవన పరిస్థితిపై పరిశీలించాని సూపరింటెండెంట్ ఈఎస్ఐ కార్పొరేషన్‌కు లేఖలు రాశారు. అలాగే సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని గతంలో పలుమార్లు సంబంధిత మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత ఎనిమిది నెలల క్రితం కూడా కార్మిక, ఉపాధి కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, బృంద సభ్యులు భవనానికి సంబంధించిన వాటిపై క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరించారు. ఉద్యోగుల నివాస గృహాలు నివాస యోగ్యంగా లేవని తేల్చారు. అలాగే భవనం కూడా శిథిలావస్థకు చేరినట్టు నివేదికలను రూపొందించారు. ఈ సమస్యలపై ఉద్యోగులతో కూడా ప్రత్యేక సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు.

● డిస్పెన్సరీ ద్వారా సేవలు..

కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిని తొలగించి ఇక డిస్పెన్సరీ ద్వారా సేవలు అందించేందుకు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం.ఈఎస్ఐ ఆసుపత్రిలో ప్రస్తుతం కేవలం 19వేల కార్డులు మాత్రమే ఉన్నాయి. ఆసుపత్రిగా సేవలు కొనసాగించాలంటే కనీసం 30 వేల కార్డులు అవసరం ఉంటుంది. డిస్పెన్సరీ ద్వారా సేవలు అందిస్తే కార్మికులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు. ఈఎస్ఐ ఆసుపత్రి ఉంటే రాత్రిళ్లు ప్రమాదాలు జరిగితే అడ్మిట్ చేసుకునే అవకాశాలుంటాయి. డిస్పెన్సరీలో ఈ అవకాశం ఉండదు. అలాగే ఈఎస్ఐ ఆసుపత్రి తొలగిస్తే సిబ్బందిని ఎక్కడకు బదిలీ చేస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. ఇన్నాళ్లు సేవలు అందించి మరో చోటికి పోతే తమ భవిష్యత్తు ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఈఎస్ఐ ఆసుపత్రిలో 30 మంది సిబ్బంది పని చేస్తున్నారు. జిల్లాలోనే అతి పెద్ద ఆసుపత్రి సేవలు అందించాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా తొలగించకూడదని కార్మికులు చెబుతున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆసుపత్రి స్థానంలో కొత్త భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తే ఈ ప్రాంత కార్మికులకు మరిన్ని సేవలు అందించే అవకాశం మెండుగా ఉంది. వర్షాకాలంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని సిబ్బంది బిక్కు బిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. ఈ విషయమై ఈఎస్ఐ సూపరింటెండెంట్ డాక్టర్‌జగన్‌ను వివరణ కోసం కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి సమస్యపై ఈఎస్ఐ కార్పొరేషన్‌కు వినతిపత్రాలు సమర్పించామని తెలిపారు.

కార్మికులకు న్యాయం చేయాలి..

- సూర్యప్రకాష్ ట్రేడ్ యూనియన్ నాయకుడు

ప్రభుత్వం ఈఎస్ఐ ఆసుపత్రి విషయంలో కార్మికులకు న్యాయం చేయాలి. వర్షాకాలంలో భవనం ఉరుస్తోంది. భవనం శిథిలావస్థకు వచ్చినట్టు అధికారులు తేల్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక నిధులు కేటాయించి వెంటనే కొత్త భవనం నిర్మించి కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలి.

రక్తదానం అత్యున్నత మానవతా సేవ

ఎస్పీ కాంతిలాల్ పాటిల్


రక్తదానం చేస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం అత్యున్నత మానవతా సేవ అని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. పోలీసు అమర వీరు సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం మనిషి చేయగలిగే అత్యున్నత మనవతా సేవ అని ఈ దానం మరొకరి ప్రాణానికి ప్రాణాధారమవుతుందని తెలిపారు. పోలీసు ఉద్యోగం అంటే కేవలం చట్ట పరిరక్షణ మాత్రమే కాకుండా ప్రజల జీవన రక్షణ కూడా అని అన్నారు. అమర వీరుల జ్ఞాపకార్థం నిర్వహించే సేవా కార్యక్రమాలు వారికి అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. రక్తదానంకు ముందుకొచ్చిన 103 మంది స్థానిక యువతకు పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ పార్టీ సభ్యులను ఎస్పీ అభినందించారు. వారి సేవాభావం సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురు వారం సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వాహిదుద్దీన్, సీఐ, ఆర్ఐలు, ఏఆర్‌హెడ్ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

కెరమెరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీజాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవలని ఎంపీడీవో సురేష్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ ఐకేవైసీ ఈ నెల 31లోగా పూర్తి చేసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా 14,450 జాబ్ కార్డులు ఉన్నాయని చెప్పారు. ఇప్పటి వరకు 9,490 మంది చేయించుకున్నారని తెలిపారు. మిగితా వారు కూడా చేయించుకోవాలన్నారు. పనుల జాతరలో మంజూరు అయిన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పురోగతి పనులు వేగం చేయాలని సూచించారు. పనులు పూర్తి చేసేకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. పనులు పూర్తియిన ప్రకారం డబ్బులు వారి అకౌంట్లలో పడుతాయనే విషయాన్ని తెలియజేయాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో అంజద్‌పాషా, ఏపీవో మల్లయ్య, కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి


ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టి), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌లో బుధవారం నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరగా స్లాబ్ లెవల్ వరకు నిర్మించుకోవాలన్నారు. వారి వారి అకౌంట్లలో డబ్బులు పడుతాయన్నారు. పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఈవో తిరుపతి, కార్యదర్శులు ఉన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలో పైలట్ గ్రామ పంచాయతీ అయిన నాగెపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని ఎంపీడీవో ప్రసాద్ బుధవారం పరిశీలించారు. స్లాబ్ వేసి పూర్తి దశలో ఉన్న లబ్ధిదారులకు చెల్లింపు జరగలేదని తెలిపారు. ఉన్నతాధికారులకు తెలియజేసి చెల్లింపులు జరిగే విధంగా చూస్తామని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా నిర్మాణాలు త్వరగా చేపట్టాలన్నారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి శౌచాలయాల నుంచి నీరు రోడ్లపై వచ్చిందని గమనించి వెంటనే ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఆయన వెంట కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

లింగాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై గంగన్న అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆదేశాల మేరకు హిస్టరీషీటర్లకు బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. గతంలో పోలీస్ స్టేషన్‌లో కేసులున్నావారి జీవన విధానంలో మార్పులు, సమాజంలో సత్‌ప్రవర్తన, వ్యక్తిగత సమాచారం తెలుసుకుని సూచనలు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఆసిఫాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారి స్తామని బీజేపీ వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లికార్జున్ యాదవ్‌లు అన్నారు. వారి తండ్రి అరిగెల లక్ష్మయ్య 33 వర్ధంతిని పురస్కరించుకుని ఇటీవల చికిత్రకుంట గ్రామంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచన మేరకు 60 మంది బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బీపీ, షుగర్, సీబీపీ పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ నిమిత్తం ప్రత్యేక వాహనంలో ఆదలాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రికి పంపించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది దీపక్‌రావు, నాయకులు రాజేంద్రప్రసాద్, పెంటు, మురళీగౌడ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌ల ఉన్న స్కాలర్ షిప్, ఇతర సమస్యలను పరిష్కరించానలి కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మా ట్లాడారు. బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, టికానంద్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మాదకద్రవ్యాలను అరికట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి జిల్లాలో మాదకద్రవ్యాల నివారణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుమరం భీం జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని తెలిపారు. గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి సాగు చేసే వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధిని నిలిపివేస్తామని అన్నారు. గంజాయికి అలవాటు పడిన వారిని గుర్తించి పునరావాస కేంద్రానికి తరలించాలని సూచించారు. పత్తి కొనుగోలులో ప్రభుత్వం చేపట్టిన కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు వివరించే సమయంలో గంజాయి సాగు వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. వాహనదారులు, డ్రైవర్లు గంజాయి రవాణా చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాలయాలు ఉన్న ప్రాంతాలలో పాన్ టేలాలు ఉండకుండా పర్యవేక్షించాలని తెలిపారు. వసతి గృహాలు, కళాశాలల వద్ద ప్రత్యేకంగా నిఘా నిర్వహించాలని సూచించారు. టోల్ ప్లాజాల వద్ద తనిఖీలు చేపట్టాలని, బస్టాండు ప్రాంతాలలో అనుమానస్పదన వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. గ్రామాలలో, విద్యా సంస్థల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి సాగు, అక్రమ రవాణా, వినియోగంపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటి వరకు 69 కేసులు నమోదు చేసి 120 మందిని జైలుకు పంపించామని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వాహిదుద్దీన్, జిల్లా రవాణా శాఖ అధికారి రాంచందర్, జిల్లా వైద్యాధికారి సీతారాం, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, డీఐఈవో రాందాస్, డిపో మేనేజర్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం అందించాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అమృత్ 2.0 పథకం కింద ఎంపికైన కాగజ్‌నగర్ మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ తయారీకి సంబంధిత శాఖాధికారులు సమగ్ర సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర శ్రద్ధశుక్లా, వరంగల్ ప్రాంతీయ ఉప సంచాకులు ప్లానింగ్ మహిపాల్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో మాస్టర్ ప్రాణాళిక రూపొందించడంపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాగజ్‌నగర్ మున్సిపాలిటీని అమృత్ 2.0 పథకం కింద ఎంపిక చేసినందున సమగ్ర అభివృద్ధికి సంబంధిత అధికారు లు పూర్తి సమాచారాన్ని మున్సిపాలిటీకి అందించాలని తెలిపారు. గత పది సంవత్సరాల క్రితం నుంచి గల వివరాలను ఇంకో 50 సంవత్సరాల ముందు వరకు అవసరమైన రహదారులు, తాగునీరు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, చెరువుల అభివృద్ధి, బీపీఎల్ కుటుంబాలు, మురికి ప్రాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వంటి అన్ని అంశాలపై సమగ్ర వివరాలు అందించాలని తెలిపారు. తద్వారా మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్రణాళిక రూపొందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రసుతత స్థితిని అర్థం చేసుకోవడానికి భవిష్యత్ అవసరాలు అంచనా వేయడానికి ప్రాదేశిక వివరాలను సేకరించాలని చెప్పారు. డిజిటల్ మ్యాపింగ్‌లో భూ వినియోగ మ్యాప్‌లు రూపొందించవచ్చని, నూతన డేటాను ప్రతిబింబించేలా జీఐఎస్ ఆధారిత ప్రణాళికలను నవీకరించవచ్చన్నారు. తద్వారా అభివృద్ధి చెందు తున్న అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్, పట్టణ ప్రణాళిక అధికారి యశ్వంత్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణి కుటుంబానికి అండగా నిలుస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

దహెగాం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హత్యకు గురైన గర్భిణి శ్రావణి కుటుంబానికి అండగా నిలుస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని గెర్రె గ్రామంలో ఇటీవల హత్యకు గురైన నిండు గర్భిణి తలండి శ్రావణి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులకు కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టు కోసం సిఫారసు చేస్తామని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్ట పరిహారం విషయంలో ఉదారంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎస్సై విక్రమ్, ఆర్ఐ నాగభూషణ్, కార్యదర్శి జ్యోతి, నాయకులు ధనుజంయ్, దామోదర్, మహేష్, అంగన్‌వాడీ టీచర్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని లగ్గాం వద్ద కల్వాడ- ఒడ్డుగూడ రోడ్డు మరమ్మతు పనులను బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మతులతో పాటు కల్వాడ నుంచి ఒడ్డుగూడ వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయించడం జరిగిందన్నారు. హ్యామ్ ఫేస్ 1 కింద ఆ పనులను కూడా చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ రంజిత్, నాయకులు ధనుజంయ్, దామోదర, రాజన్న, బాపు, గోపాల్, బొజ్జు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబాకు దూరంగా ఉండాలి


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ సంతోష్

బెజ్జూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలు గుడుంబాకు దూరంగా ఉండాలని కౌటాల సీఐ సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని లంబాడిగూడ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో తనిఖీలు చేపట్టి నలభై లీటర్ల గుడుంబా, వెయ్యి లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. సరైన పత్రాలు లేని 15 వాహనాలను పట్టుకున్నారు. గ్రామంలో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గుడుంబా తాగడం, సేవించడం తయారు చేయడం చేయకూడదని చెప్పారు. యువత సంఘ విద్రోహకశక్తులకు దూరంగా ఉండాలని కోరారు. ప్రజలు ఎప్పుడు పోలీసులు అందుబాటులో ఉండి సేవ చేసేందుకు ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సర్తాజ్ పాషా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం


దహెగాంలో నేలవాలిన వరి పంట

ఆసిఫాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై సాయంత్రం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్‌ను ప్రకటించింది. తుఫాన్ ప్రభావంతో జిల్లాలో మరో రెండు మూడు రోజుల వర్షాలు కురిసే అకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి కోతలు, పత్తి తీత పనులు చేపడుతున్న రైతులకు తుఫాన్ ప్రభావంతో నష్టం వాటిల్లనుంది. సిర్పూర్(టి)లో అత్యధికంగా 32.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కాగజ్‌నగర్‌లో 22.8, కౌటాలలో 22.3, ఆసిఫాబాద్‌లో 14.0, రెబ్బెనలో 12.0, లింగాపూర్‌లో 11.5, వాంకిడిలో 10.8 , బెజ్జూరులో 10.0, తిర్యాణిలో 8.8, సిర్పూర్ (యూ), జైనూరు మండలాల్లో 8.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయి. మండల వ్యాప్తంగా 25 వేల ఎకరాల్లో పత్తి, పది వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. పత్తి ఏరివేత దశలో వర్షాలు కురుస్తుండడంతో డిసిపోయి నేల పాలు అవుతుందని వాపోతున్నారు. వరి పైరు కోత దశలో ఉండడంతో ఈదురుగాలులకు నేల పాలవుతుందని ఆవేదన చెందుతున్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండలవ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. తుఫాన్ ప్రభావం కారణంగా మబ్బులు కమ్ముకున్నాయి. తుఫాన్ ప్రభావంతో పత్తి, వరి పంట దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతు న్నారు.

చింత లమానే పల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో కురిసిన వర్షానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే వరి కోతలు మొదలు కాగా అకాల వర్షలతో పూర్తిగా వరి నేల మట్టం కావడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయే ప్రమాదం వాటిల్లింది. కొందరు రైతులు పొలాల్లో వర్షపు నీరు నిలవడంతో కోసిన వరిని ఎండ బెట్టేందుకు తంటాలు పడ్డారు. పత్తి పంట సైతం చేతికొచ్చే దవలో తడిసి మద్దవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలతో రైతులకు పూర్తిగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పశువులకు టీకా

చింతలమానేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాజీఅనుకోడ గ్రామంలో బుధవారం పశు వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు వ్యాధుల బారిన పడకుండా టీకా తప్పనిసరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది కేశవ్, రాజన్న, స్రవంతి, దక్షిణ మూర్తి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

వాంకిడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై తులసీరాం అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మాదక ద్రవ్యాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాద కద్రవ్యాలకు అలవాటు అయితే జీవితం నాశనం అమవుతుందని చెప్పారు. మాదక ద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడానికి పోలీసులు కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు జాగ్రత్తగా ఉండి ఈ ప్రమాదకర అలవాట్లను పూర్తిగా దూరం పెట్టాలని ఎస్సై తులసీరాం తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓ మీనా, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ. పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

పెంచికలపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హత్యకు గురైన దహెగాం మండలంలోని గెర్రె గ్రామానికి చెందిన గర్భిణి శ్రావణి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని గోండ్వానా ఆదివాసీ కోయ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య, కార్యదర్శి అశోక్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి సత్వర న్యాయం జరపాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని కోరారు. యువతీ కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, సకారాం, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో వసతులు కరువు


రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాల

- సరిపడా గదులు లేక విద్యార్థుల అవస్థలు
- ప్రతిపాదనలు పంపినా పట్టింపే లేని వైనం

రెబ్బెన, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతలు లేమితో కొట్టుమిట్టాడుతోంది. దీంతో విద్యార్థుల చదువు కుంటుపడుతోంది. విద్యార్థులకు విద్యా బుద్దులు నేర్పే కళాశాలలో సౌకర్యాలు కరువయ్యాయి. రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇరుకు గదులు నడుమ విద్యాబోధన సాగుతోంది. విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు లేక పోవడంతో ఉన్న గదుల్లోనే విద్యార్థులు సర్దుకుంటున్నారు.

ఈ విషయంలో పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఇంత వరకు ఈ సమస్య పరిష్కరించటం లేదని విద్యార్థులు వాపోతున్నారు. అలాగే ఇరుకు గదులతో సమస్య ఉంటే ఇందులోనే ల్యాబ్‌లు సైతం నిర్వహించడంతో మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తోందని విద్యార్థినిలు తెలిపారు.

సరిపడా గదులు లేక..

రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 755 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల ఇంత మంది ఉన్నా 10 తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. మొదటి సంవత్సరంలో 340, రెండో సంవత్సరంలో 415 మంది విద్యార్థులు చదువుతున్నారు. జనరల్ గ్రూపు విద్యార్థులకు నాలుగు గదులు కేటాయించగా,ఒకేషనల్ విద్యార్థులకు ఆరు గదులను కేటాయించారు. మరోగది ప్రిన్సిపాల్, స్టాఫ్ రూంలకు కేటాయించి, మిగిలిన మూడు గదుల్లోనే ప్రథమ, ద్వితీయా సంవత్సరం విద్యార్థులకు ప్రస్తుతం తరగతి గదులను బోధిస్తున్నారు. గదులు సరిగ్గా లేవంటే ఇందులో ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు.

ఒకేషనల్ గ్రూపు కోసం ఆరు గదులను నిర్మించగా ఒక్కో గదిలో నాలుగేసి సెక్షన్లు నిర్వహించడంతో పూర్తిగా దయనీయ పరిస్థితులు చదువులను విద్యార్థులు చదువుతున్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా సౌకర్యాలు మెరుగుపడాలంటే కనీసం మరో 26 గదులను ఏర్పాటు చేయాల్సి ఉంది. వాటిలో జనరల్ విద్యార్థుల ల్యాబ్ కోసం ఆరు గదులు, కంప్యూటర్ ల్యాబ్ కోసం ఒకటి, స్టాఫ్ కోసం ఒకటి గది అవరం ఉంది. అలాగే ఓకేషనల్ విద్యార్థుల తరగతుల నిర్వహణ కోసం 8 అవసరం ఉండగా, ల్యాబ్‌ల ఏర్పాటు కోసం మరో ఏడు గదులు అదనంగా నిర్మించాల్సి ఉంది. అయితే అదనపు తరగతి గదుల కోసం కళాశాల సిబ్బంది ప్రభుత్వానికి నివేదికలను పంపిస్తున్నా కూడా ఇంత వరకు స్పందన రావడం లేదు. మండల కేంద్రంలో స్థలం అందుబాటులో లేక పోవటంతో కళాశాలను ఇందిరానగర్ సమీపంలో నిర్మించారు. అయితే కళాశాల చుట్టూ ప్రహరీ గోడ లేక పోవడంతో ఏ మాత్రం రక్షణ లేకుండా పోయింది. సీజీటీలకు చెందిన నాలుగు సెక్షన్లను ఒకే గదిలో నడుపుతున్నారు.

ఎంఎల్‌టీ మొదటి, ద్వితీయ సంవత్సరం తరగతుల కోసం ఒక గదిని, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం మరో గదిని, ఆర్‌ఎం మొదటి, ద్వితీయా సంవత్సరం విద్యార్థుల కోసం ఒక గదిని, కంప్యూటర్ సైన్స్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం కేటాయించారు. తరగతి గదుల్లో ల్యాబ్‌లు నిర్వహిస్తుండటంతోఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించేందుకు మరిన్ని నిధులు కేటాయించి అదనపు గదులను నిర్మించాలని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

కాసిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్దిమాడకు చెందిన అడె సాయికుమార్(20) అనే యువకుడు బైక్ కొనివ్వడం లేదని మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని మృతిచెందాడు. దేవాపూర్ ఎస్‌ఐ గంగారాం, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం సుద్దాల గ్రామానికి చెందిన అడె గంగుబాయి-జీన్‌కర్ దంపతులు 30 ఏళ్ల క్రితం దేవాపూర్‌కు ఉపాధి కోసం వలస వచ్చారు. వీరికి కూతురు, కొడుకు సాయికుమార్ ఉన్నాడు. ఏడో తరగతి వరకు చదివిన సాయికుమార్‌కు చదువుపై ఆసక్తిలేకపోవడంతో చదువు మానేసి దేవాపూర్‌లో బైక్ మెకానిక్ పనులు నేర్చుకుంటున్నాడు. భార్యాభర్తల మధ్య చెలరేగిన గొడవ వల్ల జీన్‌కర్ దేవాపూర్‌ను విడిచి సొంతూరుకు వెళ్లిపోయాడు. కూతురు, కొడుకును తల్లి గంగుబాయి కూలీ పనులు చేసుకుంటూ పోషించుకుంటుంది. నెల రోజులుగా సాయికుమార్ స్పోర్ట్స్ బైక్ కావాలని తల్లిని అడుగుతున్నాడు. మంగళవారం సాయికుమార్ బైక్ కొనివ్వాలని తల్లిని అడిగాడు. బైక్ కొనిచ్చే ఆర్థిక స్థోమత లేదని తల్లి చెప్పడంతో మనస్తాపం చెందిన సాయికుమార్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు సాయికుమార్ తల్లి గంగుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ మోసం.. నిందితుడి అరెస్టు

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసం చేసి అకౌంటు నుంచి నగదును బదిలీ చేసుకున్న కేసులో నిందితుడు ఆశిష్ కుమార్ దోహర్‌ను కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆగస్టులో బాధితుడు తన అకౌంట్ నుంచి నగదు సైబర్ మోసం వలన కోల్పోయినట్లు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. దీంతో విచారణ చేపట్టిన కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు, డి-ఫోర్-సి బృందంతో కలిసి మధ్యప్రదేశ్ రాష్ట్రం సాత్నా ప్రాంతంలో పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఫిర్యాదుదారుని అకౌంట్ నుంచి మోస పోయిన రూ. 45,790 నుంచి రూ. 34,537 ఫ్రీజ్ చేయించినటు తెలిపారు.

పశువులపై జంతువుల దాడి

ఆందోళనలో గ్రామస్థులు

అడవి జంతువుల దాడి అని అనుమానం


గాయపడిన మేకలు(ఫైల్)

మంచిర్యాల క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం పాత మంచిర్యాలలో జంతవులపై కొన్నిరోజులుగా గుర్తుతెలియని జంతువులు దాడి చేస్తున్న ఘటన కలకలం రేపుతోంది. అర్ధరాత్రి సమయంలో ఇంటి ఆవరణలో కట్టేసి ఉన్న మేకలు, దూడలపై గుర్తు తెలియని జంతువులు దాడిచేసి వెళ్తున్నాయి ప్రహరీని వీధి కుక్కలు దూకవని, నక్కలు లేదా తోడేళ్లపనేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మధురానగర్ సమీపంలో కె వెంకటేష్ ఇంట్లో ఈ నెల 16న మూడు గొర్రెలపై దాడి చేశాయి. పాత మంచి ర్యాల వాటర్ ట్యాంక్ సమీపంలో శ్రీనివాస్ ఇంటి ప్రహరీలో కట్టేసి ఉన్న రెండు మేకలపై దాడి చేశాయి. మేకల మండిలో ఉంచిన పది మేకలపై దాడి చేశాయి. ఇలాంటి దాడి కుక్కల వల్ల కాదని, అడవి జంతువులతోనే మేకలు దాడికి గుర య్యాయని బాధితులు తెలుపుతున్నారు. ఊరికి ఆనుకొని ఉన్న క్వారీ నుంచి తోడేళ్లు, నక్కలు వచ్చి దాడికి పాల్పడుతున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఫారెస్టు అధికారులు స్పందించి ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

ఇంటి ప్రహరీ దూకి దాడి చేశాయి..


- కార్ల తిరుపతి

ఇంటి కాంపౌండ్‌లో కట్టేసి ఉన్న మేకలపై దాడిచేసి వెళ్లిపోయాయి. ఇది కచ్చితంగా అడవి జంతువుల పనే. వీధి కుక్కలు ప్రహరీ దూకి దాడి చేసే అవకాశం లేదు. మున్సిపల్, అటవీ శాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు


కౌటాలలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

కౌటాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. బుధవారం కౌటాల మండలంలోని వీరవెల్లి, కుంబారి, గుడ్లబోరి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం వరి ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనలకు లోబడి రైతుల వద్ద నుంచి ఆఖరు గింజ వరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. గ్రేడ్-ఏ రకానికి క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్నరకం వడ్లకు క్వింటాలుకు మద్దతు ధరతో పాటు రూ.500 అదనంగా అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో నిబంధనల తప్పని సరిగా పాటించాలని అన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిబ్బంది, అధికారులు సదుపాయాలు కల్పించాలని సూచించారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోనవెల్లి, సిర్పూర్(టి)లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల స్థలాలను బుధవారం అదనపు కలెక్టర్ డేవిడ్, డీఆర్‌డీఏ పీడీ దత్తారావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రభుత్వ సూచన మేరకు కొనుగోళ్ల చేపడుతుతామని, రైతులు ఆందోళన చెందకుండా ఉండాలని సూచించారు. ప్రస్తుతం భారీ వర్షాలు ఉన్నందున రైతులు వరి కోత చేపట్ట వద్దని సూచించారు. వారి వెంట తహసీల్దార్ రహీముద్దీన్, ఏపీఎం, తదితరులు ఉన్నారు.

రహదారి ప్రమాదాల నియంత్రణపై దృష్టి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, అదనపు ఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కిసి రోడ్లు, భవనాలు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రవాణా, ఆర్టీసీ, వైద్య శాఖల అధికారులు, జాతీయ రహదారుల సంస్థ అధికారులతో బుధవారం రహదారి ప్రమాదాల నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై ప్రమాదాలు నియంత్రించేందుకు అవసరమైన సూచికలు ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలు ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రక్షణ పరమైన సూచిక బోర్డులు, వేగ నియంత్రణ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీటు బెల్టు ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మదయం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయానలి, జాతీయ రహదారిపై వేగ నియంత్రణ సూచికబోరుడలు ఉన్న గ్రామాలలో సర్వీసు రహదారులకువేగ నియంత్రికలను ఏర్పాటు చేయాలని తెలిపారు. జాతీయ రహదారిపై ప్రతి అయిదు కిలో మీటర్లకు వేగ నియంత్రణ సూచిక బోర్డులు ఏర్పాటు చేఆలని, ప్రమాదాలు జరిగిన వెంటన క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌ను జాతీయ రహదారుల సంస్థ అధికారులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పంచాయతీ రాజ్, రోడ్డు భవనాల శాఖ తమ పరిధిలోని రహదారులపై గుంతలను వెంటనే పూడ్చాలని, కల్వర్టులు, వంతెనల మరమ్మతు పనులు పూర్తి చేయాలని తెలిపారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాలలో రహదారులు ఆక్రమణ జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, మున్సిపాలిటీల్లో రద్దీగా ఉండే ప్రాంతాలలో రహదారి భద్రతలపై ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. జాతీయ రహదారులపై పశువులు సంచరించకుండా సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ద్విచక్ర వాహనదారులు వేగంగా వాహనాలను నడపకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం నుంచి గుండి పై ఓవర్ వంతెన వరకు ప్రధాన రహదారి పనులు త్వరగా చేట్టాలన్నారు. ఆర్టీసీ బస్సులు, విద్యా సంస్థ బస్సులు కండిషన్‌లో ఉండే విధంగా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్ షిప్‌లో సమస్యలను పరిష్కరించాలని జీఎం విజయభాస్కర్ రెడ్డి దృష్టికి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి ఆధ్వర్యంలో బుధవాంం ఏర్పాటు చేసిన సమావేశంలో తీసుకు వచ్చారు. గోలేటి ఆసుపత్రిలో బ్లడ్ షుగర్ టెస్ట్ మిషన, ఎక్స్‌రే మెషిన్ పని చేయడ లేదని వెంటనే రిపేర్ చేయించాలని కోరారు. కాలనీలో మంచినీరు సరిగ్గా రావడం లేదని చెప్పారు. మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం ఎంప్లాయి ఫ్యామిటీ ఐడెంటిఫికేషన్ ఫొటోసు స్వీకరించారని అయినప్పటికీ అవి సరిగ్గా అప్‌లోడ్ చేయక కార్మికులు మళ్లీ ఐడెంటిఫికేషన్ ప్రూఫ్ తీసుకు వెళ్లాల్సి వస్తుందని ప్రస్తావిం చారు. కార్యక్రమంలో నరేందర్ ఉమాకాంత్, భాష, రవిబాబు, మురళీ, శ్రీనివాస్, మొగిలి, రాజేష్, జగ్గయ్య ఆనంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న శ్రీరాంపూర్ ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ

శ్రీరాంపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సైబర్ సెక్యూరిటీపై అవగాహన కలిగి ఉండాలని శ్రీరాంపూర్ ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ అన్నారు. కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ వారు అక్టోబరు నెలను నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవగాహన నెలగా ప్రకటించారన్నారు. దానికి అనుగుణంగా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు చేపడుతున్నామని తెలిపారు. కార్పొరేట్ కార్యాలయం డీజీఎం(ఐటీ) ఎం. శ్రీనివాస్ రావు, మేనేజర్ (ఐటీ), సీఐఎస్ఓ నానా ఫర్నవీస్ హాజరై ఉద్యోగులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. సమావేశంలో వీటీసీ ఏటీఓ రామ్‌రావు, సీనియర్ పీవో పి కాంతారావు, ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, పిట్ సెక్రటరీ సందీప్ పాల్గొన్నారు.

అదనపు బొగ్గు ఉత్పత్తి సాధించాలి


మాట్లాడుతున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు మందమర్రి ఏరియాను అభివృద్ధితో పాటు లాభాల దిశగా నడిపించేందుకు అదనపు బొగ్గు ఉత్పత్తి సాధించాలని మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ తెలిపారు.బుధవారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో ఏరియా 11వ స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి, ఉత్పాదకతలో కార్మిక సంఘాల పాత్ర కీలకమన్నారు. పారిశ్రామిక సంబంధాల మెరుగు కోసం సంఘాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. గత సమావేశాల్లో విన్నవించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రస్తుతం చెప్పిన సమస్యలను కూడా డిపార్టుమెంట్ల వారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం కార్మికులు గైర్హాజరు కాకుండా గుర్తింపు సంఘం తమ వంతు బాధ్యతను పోషించాలన్నారు. గైర్హాజరైతే కుటుంబాలు రోడ్డున పడతాయని కార్మికులకు వివరించారు. ఏరియాను ఇతర ఏరియాలకు ఆదర్శంగా నిలిపేందుకు ఉత్పత్తి లక్ష్యంతో పాటు అదనపు ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్‌శ్యాంసుందర్, కేకే 1 గ్రూపు ఏజెంట్ రాంబాబు, శాంతి ఖని గ్రూపు ఏజెంటు ఖాదిర్, కేకే ఓసీపీ ప్రాజెక్టు అధికారి మల్లయ్య, ఏరియా స్టోర్స్ డీజీఎం ఈఅండ్‌ఎం సురేష్, సివిల్ ఎస్ఈ రాము, డీవైసీఎంవో మధుకుమార్, డీవైపీఎం సంజీవ్, గుర్తింపు సంఘం రామకృష్ణపూర్, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీలు అక్బర్‌అలీ, దాగం మల్లేష్, నాయకులు రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

శ్రీరాంపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గనుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం కుర్మ రాజేందర్ అన్నారు. న్యూటెక్ గనిలో 5 స్టార్ రేటింగ్ పరిశీలనకు త్వరలో కమిటీ సభ్యులు రానున్నందున జీఎం కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు చర్యలు, కార్మిక సంక్షేమ సదుపాయాలు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను సంసిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, డీజీఎంలు అనిల్ కుమార్, ఆనంద్ కుమార్, రవీందర్, మల్లయ్య, ఆర్కే న్యూటెక్ గని మేనేజర్ శ్రీనిష్, ఆర్కే 7 గని మేనేజర్ తిరుపతి, గ్రూప్ ఇంజనీర్ మోహన్, రక్షణ అధికారి కొట్టె రమేష్, సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఆవరణలో చెత్తాచెదారం తొలగింపు


జీఎం కార్యాలయ ఆవరణలో గడ్డిని తొలగిస్తున్న అధికారులు

రెబ్బెన, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంలో భాగంగా గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో బుధవారం స్వచ్ఛత కోసం బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు చెత్తాచెదారం తొలగించారు. గంటన్నర పాటు జీఎం విజయభాస్కర్ రెడ్డి ఏరియా అధికారులు, జీఎం కార్యాలయ ఉద్యోగులతో కలిసి చెత్త, గడ్డి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో పాల్గొంటున్న ఉద్యోగులను జీఎం అభినందించారు. గత ఏడాది బెల్లంపల్లి ఏరియాకు స్వచ్ఛతలో ద్వితీయ స్థానం లభించిందని చెప్పారు. బహుమతుల కోసం కాకుండా పరిసరాల శుభ్రత, వ్యక్తుల ఆరోగ్యం కోసం నిత్యం స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిం ాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి తిరుపతి, ఏరియా అధికారులు ఉజ్వల్‌కుమార్ బెహరా, డీజీఎం మదీనాభాషా, హరీష్, శ్రీధర్, రవికుమార్, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, ముజీబ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వన్యప్రాణుల రక్షణకు బాధ్యతగా పాటుపడాలి

లింగాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల రక్షణకు సామాజిక బాధ్య తగా పాటుపడాలని జిల్లా అటవీశాఖ అధికారి నిరంజన్‌కుమార్ టిబ్రియర్ అన్నారు. మండలంలోని పిక్లాతండా, మామిడిపల్లి, కోలాంగూడా తదితర గ్రామాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ తీగలను అమర్చి కొంత మంది వన్యప్రాణులను వేటాడుతున్నారని అలా చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. ప్రజలు ఎవ్వరు కూడా చట్టవ్యతిరేక పనులు చేయవద్దని సూచించారు. రైతులు చేలల్లో పంటల సాగుకు బావులను బాగు చేయడం కోసం అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆయన క్షేత్ర స్థాయి లో పరిశీలించి తప్పకుండా అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జోడేఘాట్ రేంజ్ అధికారి కుమర్, ఎఫ్ఎస్‌వో అనూష, భగవంత్‌రావు, బీట్‌అధికారి మహేష్‌కుమార్, హరిత, గ్రామస్థులు గుణవంత్‌రావు, కిషన్, విజేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

కాసిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చేతికి వచ్చిన వరి, పత్తి పంటలపై అడవి పందులు దాడి చేయడంతో నష్టపోతున్నామని రైతులు అధికారులకు ఫిర్యాదు చేయగా బుధవారం మల్కేపల్లి, తాటిగూడెం గ్రామాల్లోని పంట పొలాలను అధికారులు పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేశారు. ఫారెస్టు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌నాయక్, మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌లు పంట నష్టంపై సర్వే చేసి నష్టాన్ని అంచనా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో శ్రీధర్, ఏఈవో సంధ్యారాణి, రైతులు రమేష్, ప్రభాకర్‌రావు, వెంకటేష్, భీంరావు పాల్గొన్నారు.

శరవేగంగా వైద్య కళాశాల నిర్మాణం

(5వ పేజీ తరువాయి)

పనులు చివరి దశకు చేరుకున్నాయి. స్థలం కేటాయింపు, అందులోని ఇతర కట్టడాలు తొలగించడంలో జాప్యం కారణంగా ఆస్పత్రి భవన నిర్మాణ పనులు కొంతమేర ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే ప్రభుత్వపరంగా వైద్యసేవలు మెరుగుపడనున్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు చికిత్స అందుతుండగా, అరకొర సౌకర్యాల నడుమ కొంత ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. నూతన భవన నిర్మాణం పూర్తయితే అధునాతన సౌకర్యాలతోపాటు వైద్య నిపుణులతో అత్యున్నత వైద్య చికిత్సలు అందే అవకాశాలు ఉన్నాయి.

● ఇరుకు రోడ్డుతోనే ఇబ్బందులు....

కాలేజీ రోడ్డులో 350 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు జరుగుతుండగా, ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం నిర్మితమవుతున్న ఆసుపత్రి భవనానికి వెళ్లాలంటే ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద నుంచి కాలేజ్ రోడ్డులో ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఇరుకైన రోడ్డు కావడం, విపరీతమైన వాహనాల రద్దీ ఉండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి ప్రారంభమైతే వాహనాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. రోగులు, వారి బంధువుల రాకతో ట్రాఫిక్ కూడా విపరీతంగా పెరుగుతుంది. ఈ కారణంగా ఓవర్ బ్రిడ్జి కింద నుంచి వాహనాల రాకపోకలకు తరుచుగా అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఆసుపత్రి భవన నిర్మాణ స్థలం అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్నప్పటికీ విశాలమైన రోడ్డు సౌకర్యం కూడా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వేమనపల్లిలో మద్య నిషేధం



మద్య నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు

వేమనపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండల కేంద్రంలో గుడుంబా, మద్యంను నిషేధిస్తూ గ్రామస్థులు, యువకులు పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో బుధవారం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలోని కొందరు ప్రజలు గుడుంబా, మద్యానికి బానిసై పనులకు వెళ్లకుండా అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. గ్రామంలో గుడుంబా తయారు చేసినా, విక్రయించినా, బెల్టుషాపుల్లో మద్యం విక్రయించినా, గ్రామంలోని వైన్ షాపు నుంచి పెద్ద ఎత్తున మద్యం తరలించినా పోలీసులకు సమాచారం అందించడంతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం మద్య నిషేధ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

16న తెలంగాణ జన సమితి ప్లీనరీ

శ్రీరాంపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 16వ తేదీన తెలంగాణ జన సమితి ప్లీనరీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ అధినేత ప్రొఫెసర్ కోదండరాం ఆదేశాల మేరకు నస్పూర్‌లోని సమ్ము రాజయ్య ఇంట్లో నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. అన్నివర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు బాబన్న, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు సమ్ము రాజయ్య, జిల్లా కమిటీ సభ్యులు భోగ మల్లేష్, నందినేని ప్రసాద్ యాదవ్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకుడు నీరటి రాజన్న, ఆదివాసీ నాయకుడు పెద్దూరి ధర్మం, తదితరులు పాల్గొన్నారు.

బాలమిత్ర అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

లక్సెట్టిపేట, అక్టోబరు, 29(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల ప్రజావేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14సంవత్సరాల వయస్సు గల వారు 33రంగాల్లో ప్రతిభ గల చిన్నారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వచ్చేనెల 5వ తేదీ సాయంత్రంలోపు నైపుణ్య సర్టిఫికెట్‌తో పాటు అడ్రస్, రెండుఫొటోలు జతపరిచి బాలల హక్కుల ప్రజావేదిక, ఇంటి నంబర్ 2-92, గ్రామం కూరెల్ల, మండలం కోహెడ, జిల్లా సిద్దిపేటకు పోస్టు ద్వారాగానీ నేరుగా గానీ అందజేయాలని సూచించారు.

మూలమలుపు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



నంబాలలో మూలమలుపు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక ఫ్లెక్సీ

దండేపల్లి అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం-మేదరిపేట రింగ్ రోడ్డు గ్రామాలోని పలు చోట్ల మూల మలుపుల వద్ద అధికారులు బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మూలమలుపులతో ప్రమాదం పొంచి ఉందని, హెచ్చరిక బోర్డులు కరువని ఈనెల 28న మంగళవారంరోజున 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఎంపీవో రామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు మండలంలోని గూడెం, నంబాలతో పాటు పలు గ్రామాల్లోని ఉన్న మూల మలుపు వద్ద గ్రామ పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ఫ్లెక్స్‌తో కూడిన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

కలప స్మగ్లింగ్ నిరోధానికి ప్రత్యేక నిఘా

దండేపల్లి అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అడువులను కాపాడుకునేందుకు కలప స్మగ్లింగ్ నిరోధానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని తాళ్లపేట ఎఫ్ఆర్‌వో సుష్మరావు అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అడవుల సంరక్షణ కోసం అందరు కృషి చేయాలని కోరారు. కలప స్మగ్లింగ్‌కు పాల్పడిన వారిని ఉపేక్షించబోమని, కలప నిరోధానికి రాత్రి పగలు అనే తేడా లేకుండా తమ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారన్నారు. గుట్టుచప్పుడు కాకుండా స్మగ్లింగ్‌కు పాల్పడితే తమకు సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సూచించారు. తాళ్లపేట అటవీ రెంజ్ పరిధిలో ముత్యంపేట, తాపాలపూర్‌లో అటవీ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు.

'కార్మికులకు మెరుగైన వైద్యం అందడం లేదు'

మందమర్రి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి అభివృద్ధి కోసం అహర్నిషలు శ్రమిస్తున్న సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం అందడం లేదని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి బీమనాథుని సుదర్శన్ విమర్శించారు. ఏరియా వర్క్ షాప్‌లో జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో హైదరబాద్‌లోని కార్పోరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన తాళ్లపల్లి రమేష్ మృతదేహాన్ని బుధవారం మందమర్రికి తీసుకువచ్చారు. మృతదేహంపై ఏఐటీయూసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులు అనారోగ్యంబారిన పడి రెఫరల్ ద్వారా హైదరాబాద్‌కు వెళితే అక్కడ మెరుగైన వైద్యసేవలు అందడంలేదన్నారు. జనరల్ అసిస్టెంట్ రమేష్ జ్వరంతో మృత్యువాతపడ్డాడని తెలిపారు. సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సీఎండీ డైరెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. రమేష్ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.



భీమారంలోని గొల్ల వాగు ప్రాజెక్టు



ప్రాజెక్టు సమీపంలో జాలువారుతున్న నీరు

ఆకట్టుకుంటున్న గొల్లవాగు అందాలు

● అభివృద్ధి చేస్తే ప్రజలకు ఆహ్లాదం ● ప్రాజెక్టును చూడడానికి ప్రజల ఆసక్తి

భీమారం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలో ఉన్న గొల్లవాగు ప్రాజెక్టు పర్యాటకులను ఆకర్షిస్తోంది. మంచిర్యాల జిల్లా కేంద్రంనుంచి 25 కిలోమీటర్లు, భీమారం మండల కేంద్రం నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో గొల్లవాగు ప్రాజెక్టును 18 సంవత్సరాల క్రితం నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణంతో భూగర్భ వనరులు పెరగడమే కాకుండా భీమారం వ్యవసాయ మండలంగా పేరుగాంచింది. వర్షాకాలం వస్తే సందర్శకుల తాకిడితో ప్రాజెక్టు నిత్యం వాహనాలు, ప్రజలతో కళకళలాడుతుంది.

ఈ సంవత్సరం వర్షాలు ఆలస్యం కావడంతో ప్రాజెక్టు ఆలస్యంగా నిండింది. వర్షాకాలంలో ప్రాజెక్టు మత్తడి దూకింది. దీంతో ప్రాజెక్టు కింద ఉన్న జలధారలు మంచువలె తెల్లగా కనబడుతూ కనువిందు చేస్తున్నాయి. ఒక పక్క కొండలు, కొండల్లో ఉన్న వృక్షాలు ప్రాజెక్టును ఆనుకుని ఉండడం వల్ల ప్రాజెక్టు పూర్తిగా ప్రకృతి ఒడిలో ఉంది. ప్రాజెక్టు కింద మామిడి తోటలు, పొలాలు చూస్తూ ఉంటే కనువిందు చేస్తుంది. ఇక్కడ శబ్దాలు అనునిత్యం బ్యాండుమేళం వాయించినట్లుగా పెద్ద సౌండ్‌తో వినిపిస్తూ అలరిస్తున్నాయి.

ప్రాజెక్టుని ఆనుకుని అటవీ ప్రాంతం ఉండడం వల్ల అటవీశాఖ అధికారులు సాయంత్రం పక్షులు కేరింతలు కొట్టే సమయంలో పక్షులు వెళ్లే దృశ్యాలను కెమెరాల్లో బంధిస్తుంటారు. ప్రాజెక్టు ప్రాంతంలో అటవీశాఖ అధికారులు గజిబో అనే కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ గజిబో కేంద్రం నుంచి వివిధ జాతుల పక్షులు, జంతువులను సైతం వీక్షిస్తుంటారు. గొల్లవాగు ప్రాజెక్టు పూర్తిగా ప్రకృతి ఒడిలో ఉండడం వల్ల చుట్టూ చెట్లు మధ్యలో ప్రా జెక్టు ఉండడంతో ప్రాజెక్టు నుంచి దూకుతున్న నీరు బండల సందుల్లో నుంచి జాలువారుతూ అందంగా కనిపిస్తుంది. కొంత మంది ఇతర జిల్లాల నుంచి సైతం ఇక్కడకు వచ్చి ప్రాజెక్టు అందాలను తిలకిస్తుంటారు. ప్రభుత్వం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా చేస్తే ప్రజలకు ఆహ్లాదకరంతో పాటు ఆదాయం కూడా వస్తుంది.

ప్రాజెక్టుకు చేరుకోవడం ఇలా...

మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి బస్సు మీదుగా భీమారం అవడం క్రాస్‌రోడ్డు వద్ద దిగి నెన్నెల రోడ్డు మీదుగా సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలో మామిడి తోటల మధ్య నుంచి రోడ్డులో వెళితే గొల్లవాగు ప్రాజెక్టు కనబడుతుంది. గొల్లవాగు ప్రాజెక్టు ఖాజీపల్లి సమీపంలో గల పెద్దవాగు నుంచి ప్రారంభమై నర్సింగాపూర్ గ్రామం మీదుగా వచ్చే చిన్న వాగుతో కలిసి బూరుగుపల్లి వద్ద నుంచి వచ్చే మరో వాగుతో కలిసి ఒక ప్రాంతంలో మిళితమై వాగుగా ఏర్పడుతుంది. గొల్లవాగు ప్రాజెక్టును చూడడానికి వచ్చిన వారు ఇక్కడే విందులు చేసుకుంటూ ఉత్సాహంగా గడుపుతున్నారు. కానీ ప్రాజెక్టు వద్ద రోడ్డు బురదమయంగా ఉండడంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రాజెక్టును అభివృద్ధి చేయాలి: అమర్‌సింగ్ నాయక్, భీమారం



గొల్లపల్లి వాగు ప్రాజెక్టును ఏకో టూరిజంగా అభివృద్ధి చేస్తే పర్యాటకులు మరింత పెరుగుతారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. అలాగే ప్రాజెక్టు మీద రోడ్డును, విద్యుత్ బల్బులు ఏర్పాటుచేస్తే ప్రాజెక్టు మరింత అందంగా కనిపి స్తుంది. వర్షాకాలం లో ప్రాజెక్టు వద్ద రోడ్డు బురదమయంగా మారు తుంది. దీంతో ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు వరకు రోడ్డును బాగు చేయాలి.

పార్కు ఏర్పాటు చేయాలి: రేషవేని లక్ష్మణ్, భీమారం



గొల్లవాగు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో పార్కులను ఏర్పాటు చేస్తే సందర్శకులు మరింత ఎక్కువవుతారు. ప్రాజెక్టు కోసం వందల ఎకరాల భూములను ఇరిగేషన్ శాఖ తీసుకుంది. కానీ కొన్ని ఎకరాల భూమిని మాత్రమే ప్రాజెక్టు నిర్మాణానికి ఉపయోగించుకున్నారు. దీంతో మిగిలిన భూములు బీడు భూములుగా మారాయి. ఈ భూముల్లో పార్కులను ఏర్పాటు చేస్తే ప్రజలు వారి పిల్లలతో కలిసి సెలవు దినాల్లో పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుంది. ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. ప్రభుత్వం గొల్లవాగు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చాలి.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

మందమర్రిరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిర్రకుంట, సారంగపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఆయన మాట్లాడతూ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా నిర్మించుకోవాలని, దశల వారీగా బిల్లులు అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

టీఎల్ఎం కిట్‌లు పంపిణీ

తాండూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తాండూర్‌లోని భవిత సెంటర్‌లో అలిమ్‌కో సంస్థ ఎంపిక చేసిన దివ్యాంగ పిల్లలకు బుధవారం ఎంఈవో మల్లేశం టీఎల్ఎం కిట్‌లు అందజేశారు. దివ్యాంగ పిల్లలు హీన, ప్రణీత్, జ్ఞానతేజస్‌లకు కిట్‌లను అందించారు. ఐఈఆర్‌పీఎస్ వెంకటేశ్వర్లు, సతీష్, ఫిజియోథెరపిస్టు వెంకటేష్, సీఆర్‌పీ తిరుపతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బెల్లంపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డు కాల్‌టెక్స్ ఏరియాలో రూ. 1లక్ష 60 వేల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ కౌన్సిలర్ నెల్లి శ్రీలత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో కాల్‌టెక్స్ ఏరియాలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో సీసీ రోడ్డులు, డ్రైనేజీనిర్మాణాలు చేపట్టామన్నారు. పూర్తి స్థాయిలో అన్ని వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నెల్లి రమేశ్, నెల్లి సమ్మయ్య, నర్సయ్య, శంకర్, రవి కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పరీక్ష నిర్వహణ తనిఖీ

లక్సెట్టిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్ర క్రిష్ణవేణి పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ-1పరీక్షలను మండల విద్యాధికారి శైలజ బుధవారం పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్ష నిర్వహణ తనిఖీలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంఈవో వెంట పాఠశాల ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, అకాడమిక్ అడ్మినిస్ట్రేటీవ్ శివరంజని తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కస్తూర్బా పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న, ఉపయోగానికి పనికి రాకుండా ఉన్న పాత గదులను తొలగించి నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనల ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతీ పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మంచి ప్రవర్తన అలవాటు చేయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పించి వారి సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, నాణ్యత సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ..

మందమర్రిరూరల్: కస్తూర్బా పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన పరిశీలించారు. తరగతి గదులు, పరిసరాలను, రిజిష్టర్లను, మధ్యాహ్న భోజనం నాణ్యతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, శుద్ధమైన తాగునీరు అందించాలని ఆదేశించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. కలెక్టర్‌వెంట డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, ఆర్ఐ గణపతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆల్‌ఇండియా పోటీలకు విద్యార్థుల ఎంపిక



రన్నరప్ ట్రోఫీతో మంచిర్యాల జట్టు

మంచిర్యాల,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించిన సాఫ్ట్‌బాల్ అంతర్ జిల్లా యూనివర్సిటీ పోటీల్లో జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాల జట్టు మంచి ప్రతిభ కనబరిచి రన్నర్‌గా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. జట్టులోని క్రీడాకారులు డానియల్, జి. కమల్‌రాజ్, ఎ. ప్రదీప్, పి. అభినవ్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆల్‌ఇండియా స్థాయి పంజాబ్ యూనివర్సిటీలో డిసెంబరులో జరిగే పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కాగా వీరిని మిమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ టి శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపాల్ పి శ్రీధర్‌రావు, డైరెక్టర్ విజయ్‌కుమార్. పీడీ నూనె శ్రీనివాస్, అధ్యాపక బృందం అభినందించారు.

దాబాలపై దాడులు

కోటపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్, రాపన్‌పల్లి సమీపంలోని జాతీయ రహదారిపై అక్రమంగా వెలిసిన దాబాలపై ఎస్ఐ రాజేందర్ బుధవారం దాడులు నిర్వహించారు. సుమారు రూ. 25 వేల మద్యం సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

గూడెంలో కార్తీక శోభ



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

దండేపల్లి అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మండలం గూడెం సత్యనారాయణస్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చి బుధవారం పూజలను నిర్వహించారు. భక్తులు కుటుంబసమేతంగా గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరించి, నదిలో కార్తీక దీపాలను వదిలిపెట్టారు. అనంతరం సత్యదేవుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలతో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వందలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానలయం ధ్వజ స్తంభం, రావి చెట్టు వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలింగించారు. దీంతో ఆలయం వద్ద కార్తీక శోభ సంతరించుకుంది.

సంక్షేమ నిధి చెక్కు అందజేత

నస్పూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సురేష్ అకాల మరణం చెందగా వారి కుటుంబానికి పీఆర్‌టీయూ టీఎస్ సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయల విలువైన చెక్కును నాయకులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్, ప్రధాన కార్యదర్శి బచ్చ మోహన్ రావు, నాయకులు రాజన్న, వెంకటస్వామి, ప్రసాద్, సంతోష్, వెంకటస్వామి, శ్రావన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఎమ్మెల్యే ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు



పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నస్పూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్య మెరుగు పడి ప్రజా క్షేత్రంలోకి సంపూర్ణ ఆరోగ్యంతో రావాలని కోరుతూ నస్పూర్ పట్టణంలోని సీసీసీ హనుమాన్ ఆలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పూజలు చేశారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని కోరుతూ ఇక్కడి నుంచి దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు అనారోగ్యంతో అసుపత్రిలో ఉన్నందున త్వరగా కోలుకుని ఆరోగ్యవంతులుగా ప్రజాక్షేత్రంలోకి అడుగు పెట్టాలని దేవున్ని ప్రార్థించారు. అదే విధంగా నస్పూర్ నుంచి మంచిర్యాల, లక్సెటిపేట, గూడెం వరకు పాదయాత్ర చేసి సత్యదేవుడి వద్ద పూజలు చేసి తొందరగా ఎమ్మెల్యే కోలుకోవాలని మొక్కులు చెల్లించుకుంటున్నామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ ధర్ని మధుకర్, యూత్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్ళ సంపత్ రెడ్డి, మాజీ ఎంపీటీసి భూపతి శ్రీనివాస్, నాయకులు కొండ్ర లింగయ్య, రవీందర్, మారు మల్లయ్య, రావి కిషన్, చిందం మల్లేష్, వెంగల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీరు

- వాహనదారుల ఇబ్బందులు



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

నస్పూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీసీసీ కార్నర్ నర్సయ్య భవనం సమీపంలో జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలిచి రాకపోకల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మురుగు కాలువ సక్రమంగా లేకపోవడంతో నీరు రోడ్డుపై చేరుతోంది. దీంతో చెత్తాచెదారం, మట్టి, ఇసుక కొట్టుకువస్తోంది. భారీవర్షం కురిస్తే వరదనీరు భారీగా చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తోంది. పరిసరప్రాంతాలు బురదతో నిండిపోతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక దిబ్బలతో ద్విచక్ర వాహనదారులు జారి పడిపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలని వాహనాల చోదకులు కోరుతున్నారు.

కపాస్ కిసాన్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రభాకర్

కాసిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ కపాస్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకో వాలని మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ అన్నారు. బుధవారం మల్కేపల్లి, గోండుగూడలలో యాప్‌పై రైతులకు అవగాహనకల్పించారు. ఆయన మాట్లాడుతూ కపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని సీసీఐలో పత్తిని విక్రయించవచ్చన్నారు. తేమ 8 నుంచి 12 శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీధర్, సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

జన్నారం, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): భారత సీజేఐ బీఆర్ గవాయ్‌పై బూటు విసిరిన వ్యక్తిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ నవంబరు 1న నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొనుగూరి ప్రభు దాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాకేశ్ కిషోర్‌ను బహిరంగంగా క్షమాపణ చెప్పించడమే కాకుండా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జంగం రవి, బచ్చల క్రిష్ణ, రాజేశ్, ప్రవీణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా వైద్య కళాశాల నిర్మాణం



● 90 శాతం మేర పనులు పూర్తి ● రూ. 216 కోట్ల అంచనా వ్యయం

మంచిర్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మంజూరైన వైద్య కళాశాల, దాని అనుబంధ ఆస్పత్రి శాశ్వత భవనాల నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. మంచిర్యాల జిల్లాగా ఏర్పడ్డ తరువాత మెడికల్ కళాశాలతోపాటు దానికి అనుబంధంగా 350 పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంజూరయ్యాయి. వైద్య కళాశాల ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఓ తాత్కాలిక గోదాములో నిర్వహిస్తుండగా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సుమారు 50 ఏళ్లనాటి పురాతన భవనంలో కొనసాగిస్తున్నారు. వైద్య కళాశాలతోపాటు అనుబంధ వైద్యశాలకు సొంత భవనాలు మంజూరు కాగా, వాటి నిర్మాణ పనుల్లో ఇటీవల వేగం పుంజుకుంది. కలెక్టర్ కుమార్‌దీపక్ తరుచుగా రెండు భవనాలను సందర్శిస్తూ నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటు న్నారు. ప్రస్తుతం వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు దాదాపు 90 శాతం మేర పూర్తికాగా, ఆసుపత్రి నిర్మాణం కూడా ఇంచుమించు అంతే వేగంగా కొనసాగుతోంది.

నాలుగు విభాగాలుగా పనులు..

జిల్లాకు మంజూరైన వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు కూడా వేగం పుంజుకున్నాయి. వైద్య కళాశాలకు శాశ్వత భవన నిర్మాణ కోసం అవసరమైన స్థలాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట సమీపంలో కేటాయించారు.

వైద్య కళాశాలతో పాటు ఆసుపత్రి భవన నిర్మాణ పనులకు 2024 ఆగస్టులో అగ్రిమెంట్ పూర్తికాగా 2026 మార్చి 30 వరకు పనులు పూర్తి కావాల్సి ఉంది. వైద్య కళాశాల భవనానికి రూ. 216 కోట్ల అంచనా వ్యయంతో డాస్ ఇంజనీరింగ్ కంపెకి నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. కాగా నిర్మాణ పనులను నాలుగు విభాగాలుగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా బాయ్స్ హాస్టల్‌ను జీ+6తో నిర్మిస్తుండగా, గర్ల్స్ హాస్టల్‌ను జీ+7, కళాశాల భవనం జీ+3, ప్రిన్సిపాల్ క్వార్టర్‌తోపాటు గెస్ట్ హౌజ్‌ను జీ+2లో నిర్మిస్తున్నారు. ఈ పనులు ప్రస్తుతం 90 శాతం మేర పూర్తికాగా, గడువులోపు లక్ష్యం చేరేలా వేగవంతం చేశారు.

93 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణం..

వైద్య కళాశాలకు అనుబంధంగా మంజూరైన 350 పడకల సామర్థ్యం కలిగిన ఆసుపత్రి శాశ్వత భవన నిర్మాణానికి కాలేజ్ రోడ్డులోని బీట్ మార్కెట్ ఆవరణలో స్థలం కేటాయించారు. రూ. 93 కోట్ల 93 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా, పనుల్లో వేగం పుంజుకుంది. మొత్తం మూడంతస్తులతో కూడిన ఆస్పత్రి భవన నిర్మాణంలో భాగంగా మిగతా 7వ పేజీలో

అన్నదాతకు మొంథా దిగులు


నస్పూర్‌లో నేలవాలిన వరి పంట

● ఎడతెరిపిలేని వర్షం ● నేలవాలిన వరి పంట

మంచిర్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మంచిర్యాల జిల్లావ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలో 10.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా చెన్నూరు మండలంలో 31.2 మిల్లీమీటర్ల వర్షం పడగా, కోటపల్లిలో 22.4 మిల్లీమీటర్లు, వేమనపల్లి మండలంలో 21.8 మిల్లీమీటర్లు, భీమారం మండలంలో 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నస్పూర్: మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా నస్పూర్ పట్టణంలో బుధవారం వర్షం కురిసింది. వరి కోతలు, పత్తి ఏరే సమయం కావడం వీటిపై తుఫాన్ ప్రభావం పడింది. ఉదయం నుంచి కురుస్తున్న వర్షం వలన రోడ్లపై వర్షపు నీరు, అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి. వర్షంతో పాటు గాలి వీస్తున్నందున నస్పూర్, సీతారాంపల్లి గోదావరి నది తీరం, చెరువుల కింద సాగు చేసిన వరి పంట అక్కడక్కడ నేలవాలింది. చేతి కందే సమయంలో తుఫాన్ నష్టం కలిగిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు సాగు చేపట్టిన నాటినుంచి ఏదో విధంగా పంటలకు నష్టం కలుగుతూనే ఉందన్నారు. ప్రస్తుతం మొంథా తుఫాన్ వలన కోతకు వచ్చిన వరి పంట నేలవాలిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మందమర్రిటౌన్: మందమర్రి పట్టణంలో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నామే చీకటిలా మబ్బులు కమ్మేశాయి. ఈదురు గాలులతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. వర్షానికి రోడ్లపై వరద నీరు ప్రవహిస్తోంది. రామన్ కాలనీ నుంచి కేకే 5 బంగ్లాస్ వరకు రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేకే 5 ఫిల్టర్ బెడ్ ఏరియాలోని నివాసాల్లోకి, లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. పట్టణం నుంచి శంకర్‌పల్లెకు వెళ్లే రోడ్డు కొట్టుకుపోయి కంకర తేలింది. భాగ్యనగర్ కాలనీ, కూరగాయల మార్కెట్‌లో నీరు చేరింది. కార్మెట్ హైస్కూల్ సమీపం నుంచి వచ్చే వరద నీరు పక్కనే ఉన్న క్వార్టర్లలోకి చేరుతుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. పాలచెట్టు నుంచి దొరల బంగ్లా వరకు రోడ్డు కనిపించకుండా వరద నీరు ప్రవహించింది. సీఈఆర్ క్లబ్, పాకిస్తాక్ క్యాంపు వద్ద గల పాలవాగు ఉప్పొంగి ప్రవహించింది. వర్షంతో చిరు వ్యాపారాలకు గిరాకీలు లేకుండాపోయాయి. వర్షం వల్ల గనులకు కార్మికుల హాజరు శాతం తగ్గింది. ఓసీపీల్లో వర్షంతో కొంత ఉత్పత్తికి ఆటంకం కలిగింది.

మందమర్రిరూరల్: మండలంలో ఈదు రుగాలులతో కూడిన వర్షం పడింది. దీంతో ప్రజలు, వాహనదారులు, కూలీలు వర్షంతో ఇబ్బందులు పడ్డారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో ప్రజలు ఎవరు బయటకు రాలేదు. భారీ వర్షం కారణంగా పట్టణంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో పత్తిపంటకు తీవ్ర నష్టం కలిగింది.

జన్నారం: . మండలంలో కొద్దిపాటి వర్షం పడడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉదయం నుంచి వర్షం కురవడంతో ప్రజలు బయటకు రాలేదు.

వెంటాడుతున్న వర్షాలు..

కాసిపేట: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి నల్లబడడంతో నష్టం వాటిల్లనుంది. వరి పొట్టదశలో ఉండడం వల్ల చీడపీడలు ఎక్కువగా ఆశిస్తున్నాయి. దీంతో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



మందమర్రి మూడవ జోన్‌లో ఇళ్ల మధ్య నిలిచిన నీరు, రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీరు

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

భీమిని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని చిన్న తిమ్మాపూర్ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని గ్రామాలు బాగుంటేనే దేశం రాష్ట్రం బాగుంటుందన్నారు. అనంతరం సోంషెట్టి పెద్ద రాజయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా వచ్చిన చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగామోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాధం లక్ష్మీనారాయణ, బెల్లంపల్లి మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, పీఆర్ డీఈ సంతోష్, మాజీ సర్పంచు ఇందూరు భూమయ్య, ఏఈ రాఘవేంద్ర, ఆర్‌ఐ కిషన్‌రావు, మాజీ ఉపసర్పంచు కార్నాథం శ్రీకాంత్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌ను పకడ్బందీగా రూపొందించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 పథకం కింద జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలని, ఇందుకు అవసరమైన వివరాలను సంబంధిత శాఖల అధికారులు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మంచిర్యాల, మందమర్రి మున్సిపాలిటీ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరం ప్రస్తుత స్థితిని అర్థం చేసుకోవడానికి, భవిష్యత్ అవసరాలు అంచనా వేయడానికి ప్రాదేశిక వివరాలను సేకరించాలన్నారు. డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించి భూ వినియోగ మ్యాప్‌లు రూపొందించాలని ఆదేశించారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రజలకు అవసరమైన ఇళ్లు, తాగునీరు, రహదారులు, ఇతర ప్రజాసేవలు ప్రణాళికాబద్ధంగా అందించేందుకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 37.67 కిలోమీటర్ల ఏరియాలో, మందమర్రి మున్సిపల్ పరిధిలో 38.98 కిలోమీటర్ల ఏరియాలో ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్లు సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, సర్వే సమయంలో అవసరమైన మద్దతు అందించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రూపొందించే జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమర్ధవంతంగా తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీ సంయుక్త సంచాలకులు, నోడల్ అధికారి అశ్విని, మంచిర్యాల డీటీసీపీవో సంపత్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా

జైపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. జైపూర్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఇందారంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులను సమాజం ఎప్పటికి మర్చిపోదన్నారు. వారి జ్ఞాపకార్థం ప్రతీ సంవత్సరం పోలీస్ ఫ్లాగ్‌డే నిర్వహిస్తున్నామన్నారు. పోలీసులు చేసే సేవా కార్యక్రమాలకు ప్రజలు, యువత సహకరించినప్పుడు పోలీసుల ఉత్సాహం, విశ్వాసం రెట్టింపు అవుతుందన్నారు.

ఎంతోమంది అమరుల త్యాగా లను స్మరిస్తూ వారిని ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర, దేశ అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి జీవితాలను కాపాడడంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుంద న్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి, తలసేమియా వ్యాధిగ్రస్తు ల కోసం రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు శాఖ గురించి తెలుసుకోవడానికి ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహిస్తు న్నామని తెలిపారు. స్లీపర్ డాగ్స్ వాటి ప్రతిభతో ఆకట్టుకోగా విద్యార్థు లు ఆసక్తిగా వీక్షించారు. కమిషనరేట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఓపెన్ హౌస్ విద్యార్థులను ఉత్సాహపరిచింది. అనంతరం రక్తదానం చేసిన వారికి సీపీ ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ఆర్ ప్రకాష్, పోలీసులు పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలతో సమానం

బెల్లంపల్లి: రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పద్మశాలి భవన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఏసీపీ సీఐలతో పాటు పోలీసు సిబ్బంది రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు.

ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి ఏటా పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరంతో పాటు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం రక్త దానం చేసిన యువకులు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసరావు, హనోక్, శశిధర్ రెడ్డి, దేవయ్యతో పాటు సబ్‌డివిజన్‌లోని ఎస్‌ఐలు, సీఐలు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు సురభి శరత్‌కుమార్, అభినవ సంతోష్, కాసర్ల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో మొత్తం 240 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

రక్తదానం చేసిన నాయకులు

భీమారం: జైపూర్ మండలంలోని ఇందారంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ భుక్య రాజ్‌కుమార్‌నాయక్, బలరాందేవ్, రాజ్‌కిరణ్ రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వీరికి రామగుండం సీపీ అంబర్ కిశోర్‌ఝా, డీసీపీ భాస్కర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో బలరాంనాయక్, రాజునాయక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా బుధవారం బెల్లంపల్లిలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి దేవాపూర్ నుంచి 50 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. వీరికి బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ప్రశంసా పత్రాలు అందించారు.



రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా, బెల్లంపల్లిలో యువకులకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఏసీపీ రవికుమార్, సీఐలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని బీఆర్‌ఎస్‌వీ ధర్నా



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు, విద్యార్థులు

నస్పూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేస్తూ బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్‌ఎస్‌వీ) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అంతకుముందు ప్రధాన రహదారి కమాన్ నుంచి కలెక్టరేట్ వరకు నాయకులు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. హలో విద్యార్థి చలో కలెక్టరేట్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో విద్యావ్యవస్థ అనేక సమస్యలతో కుంటుపడిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నందున విద్యార్థులకు సమస్యగా మారిందన్నారు. కాంట్రాక్టు పనులు చేసిన మంత్రులకు బిల్లులు చెల్లించిన ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్, నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గుల మధు, నాయకులు సాజిత్, రాముడు లక్ష్మి కాంత్, గాజుల చంద్ర, కిరణ్, సతీష్, రాజేందర్, సంతోష్, మనీ, శ్రీధర్, శివ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జిగా దాగాం శ్రీనివాస్



బెల్లంపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జిగా దాగాం శ్రీనివాస్‌ను నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం శేఖర్, స్టేట్ కోఆర్డినేటర్ రామచంద్రం ఒక పత్రికటనలో తెలిపారు. జిల్లా ఇన్ చార్జిగా ఎన్నికైన శ్రీనివాస్ మాట్లాడుతూ బీఎస్పీ పార్టీ బలోపేతానికి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పర్యటిస్తానన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసే విధంగా కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానని తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ

నెన్నెల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా భారీవర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ సూచించారు. మండల కేంద్రంలోని పత్తి చేలు, వరి పొలాలను మండల వ్యవసాయ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. పంటల పరిస్థితి గూర్చి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి చేలల్లో వరద నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పత్తి సేకరణ, వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. పత్తిలో తేమ లేకుండా చూసుకొని మార్కెట్‌కు తరించాలన్నారు. అవసరమైతే ఎండలో ఆరబెట్టాలన్నారు. 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉంటేనే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందన్నారు. పత్తి రైతులు తప్పకుండా కపాస్ కిసాన్ యాప్ డౌన్ లోడ్ చేసుకొని అందులో వివరాలు నమోదు చేయాలన్నారు. స్లాట్ బుక్ చేసుకొని నిర్దేశించిన సమయానికే పత్తి విక్రయానికి మార్కెట్‌కు వెళ్లాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్ గురించి ఎలాంటి సందేహాలున్నా స్థానిక ఏఈవోలను సంప్రదిస్తే వారు నివృత్తి చేస్తారని పేర్కొన్నారు. డీఏవో వెంట మండల వ్యవసాయ అధికారి పుప్పాల సృజన, ఏఈవో రామ్‌చందర్ ఉన్నారు.


నెన్నెలలో పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ